


# తతిగాని..

## అన్నమయ్య పదాలు సామాజిక దృక్పథాలు

ఈ సృష్టిలో పుట్టిన ప్రతీ ప్రాణీ మరణించక తప్పదు. అ మరణం సహజ మరణంగా ఉండాలి. అంతే కానీ హత్య చేయుబడడం వల్లో , ప్రమాదవశానో సంభవిస్తే అది అసహజ మరణం క్రిందే లెక్క కొస్తుంది. ఒక మనిషిని ఇంకొక మనిషి చంపడం అన్నది అమానుషం ! కలసి మెలసి ప్రేమానురాగాలతో జీవించాల్సిన మానవాళి కల్లోలాలు కక్షలతో ఒకరినొకరు చంపుకోవడం ఏ సమాజమూ హర్షించదు. ఈ చంపుకోవడం అనేది, అస్తికోసమో, అధికారంకోసమో, అక్రమణ కోసమో అయితే అది పశు ప్రవృత్తి క్రిందకే వస్తుంది. అనాదిగా భారతదేశం అనేక దండయాత్రలకి గురిఅవుతూనే ఉంది. క్రీ. శ. 1450 సంవత్సరంలో బహమనీ సుల్తానులు విజయనగరం పై దండెత్తి వచ్చారు. ఈ దండయాత్రలో పిల్లా జెల్లా అని చూడకుండ కనిపించిన ప్రతీ మనిషినీ చంపి పోగులెట్టారు. ఈ దౌర్జన్య కాండ చూసి రాజులు పోరాడినా అమాయక ప్రజలూ ఈ ఘాతుకానికి బలి అయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ తురుష్కుల దౌర్జన్యాన్ని కళ్ళారా జూసి చలించిపోయాడు అన్నమయ్య.. కత్తి పట్టి కదనరంగలోకి దూకక పోయినా తన సంకీర్తనా కవిత్వపు కత్తితో ఆ అమానుష చర్యని ఖండించాడు. ఎంతో హృదయవిదారకంగా విలపించాడు. నిస్సహాయుడిగా శ్రీ వేంకటేశుని వేడుకుంటూ అప్పటి పరిస్థితులను కళ్ళకు కట్టినట్లుగా చెబుతూ సంకీర్తన రూపంలో తన గోడు వెళ్ళ బుచ్చుకున్నాడు.

తతిగాని యీ పాటు దైవమా విచారించవే
కతలాయ జెప్ప నేడు కలికాల మహిమ - పల్లవి -

తుటుములై భూసురుల తుండెములు మొండెములు
యిటువలె భూతములు యెట్టు మోచెనో
అటు బాలుల రొదలు అకాశ మొట్టోరిచెనో
కటకటా యిట్లాయ గలికాల మహిమ - తతిగాని -

దేముడా, ఈ సమయంలో యుద్ధం అనే దౌర్జన్యకాండ పాట్లు విచారించవా? ఒక్కో మరణం ఒక కథలాగ చెప్పేలా ఉంది ఈ కలికాలమహిమ అంటూ విలపించాడు. ( తతిగాని అంటే ఈ సమయంలో అని అర్థం )
తెగిన తలలతో మొండెముల బరువుని ఈ భూమి ఎలా భరించిందో ?
పసి పిల్లల అక్రందనలతో దద్దరిల్లిన రోదనలను ఈ అకాశమెట్లా ఓర్చుకుందో? ఎంతటి దారుణం ఈ కలికాల మహిమ అంటూ రోదించాడు. అన్నమయ్య.

అంగలాచే కామినుల యంగ భంగపు దోపు
లింగితాన మింట సూర్యు డెట్టు చూచెనో చూచెనో
పొంగు నానా జాతి చేత భువన మెట్లా నెనో
కంగి లోక మిట్లాయ గలికాల మహిమ - తతిగాని -

అరుదు గోహత్యలు సేయగ దూడ లంగలార్వ
సరి ధర్మ దేవ తెట్టు సమ్మతించెనో
పర ధన చూర కెట్టు పట్టాయనో లక్ష్మి
కరుణ యెం దణగెనో కలికాల మహిమ - తతిగాని -

పట్టపగలు స్త్రీ లను మానభంగంచేయడం చూస్తూ ఆ సూర్యుడెట్లా భరించాడో? నానా జాతి మనుష్యులచేత నిండి ఈ భూమి కంగి పోయింది కదా అంటూ అప్పుడు జరిగిన సంఘటనలు కళ్ళకు కట్టినట్లు చెప్పాడు. మనుష్యులే కాదు, పశువులూ ఈ దమనకాండలో దహించుకుపోయినవారే! ముఖ్యంగా తల్లి ఆవుని కళ్ళముందే చంపడం చూసిన దూడల కన్నీరు ధర్మదేవత ఎలా భరించిందో? కనిపించిన ధనం దోచుకుంటున్న వారిని చూసి లక్ష్మి కరుణ ఎందులో అణిగి ఉంది అంటూ తూర్పార బట్టాడు అన్నమయ్య.

దేవాలయాలు నానా దేశములెల్లా జొచ్చి
దేవగానెట్లుండిరో దేవతలు
తావులేలే రాజులకు దయ గొంత పుట్టదాయె
కావరమే ఘనమాయె కలికాల మహిమ - తతిగాని -

నిరప రాధుల జంపి నెత్తురు వారించగానూ
తెరల కెట్టుండిరో దిక్పాలులు
నిరసవర్తను లుండే విపరీతకాలమున
గరువాలుగపటాలె కలికాల మహిమ - తతిగాని -

ఉపమింజి దంపతులు నొకరొకరిని జూడ
చపల దుఖములతో సమయగాను
తపములు జపములు ధర్మము లెందణిగెనో
కపురు బాపాలు నిండె గలికాల మహిమ - తతిగాని -

ఆ తురుష్కుల యుద్ధంలో దేవాలయాలూ భూమట్టం గావించబడ్డాయి. శిధిలాల మధ్య దేవతా మూర్తులు కళావిహీనంగా ఉన్నాయి. కరుణ లేని పాలకులకు కండకావరమే గొప్పగా ఉంది అంటూ తన భాధని నిస్సహాయం గా చెప్పాడు. అమాయక ప్రజలనూ చంపుతుంటే చూస్తూ నిరసన, ప్రతిఘటన చూపించని రక్షక భటులు ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటే కదా? చేసిన తప్పస్సు, జపాలు ధర్మము ఎక్కడ దాక్కొని ఉన్నాయని ప్రశ్నించాడు అన్నమయ్య.

తలలు వట్టిడువగా తల్లులు బిడ్డల వేయ
తలపెట్టుండెనో యంతర్యామికి
మలపి ముక్కులు గోయ మరుడెట్టు వోరిచెనో
కలలే ఘనమాయ గలికాల మహిమ - తతిగాని -

దీనత లోబడి గుండెదిగు లసురుసురులు
వాని నెట్లు లోగోనో వాయుదేముడు
గూను వంజి తల్లి చూడ గొడుకు గుత్తిక గోయ
గాన బడె నింతేసి కలికాల మహిమ - తతిగాని -

పలుమారు నమ్మింజి ప్రాణములు గొనగాను
ఇల దమలో బ్రాణాలెట్లుండెనో
నెలవై శ్రీ వేంకటేశ నీవే యెరుగుదువు
కలుషమే ఘనమాయ గలికాల మహిమ - తతిగాని -

తల్లి కళ్ళముందే బిడ్డల తలనరకడం ఎంతఘోరం? కాళ్ళూ చేతులూ, ముక్కులూ చెవులూ కనిపించిన అవయవాలని నరికి వేయడం ఈ కలికాలపు మహిమలా ఉంది అంటూ తను చూసిన ప్రతీ ఘోరాన్నీ హృదయవిదారకంగా చెప్పాడు. ఇలా అమానుషంగా ప్రతీ మనిషీ ఇంకొకర్ని చంపుకుంటూ పోతే మిగిలే ప్రాణాలు ఏముంటాయో దేముడికి తెలియదా ? అంటూ తన బాధనీ, ఆవేదననీ కవిత్వపు కన్నీరులో చూపించాడు అన్నమయ్య.

ఏ మతమూ మరణాన్ని కోరదు. సహనాన్నీ సహృదయతనే పంచి యిస్తుంది. మతం పేరుతో మనుష్యులని చంపడం అమానుషం !

సహజీవనం ఈ కలికాలంలో మానవాళికి అవసరం!

మరణానికి మతం లేదు కవిత్వానికి కులంలేదు. ఈ సత్యాన్నెరిగి ప్రజలను కవిత్వపు ఉత్తేజాన్ని కలిగించేవాడే నిజమైన కవి. అ కవితాలంకారికులలో అగ్రగణ్యుడు అన్నమయ్య!